

# గ్రేటర్ హైదరాబాద్



## అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

**- అభినందించిన మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**రామచంద్రపురం జూన్ 9**



భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీకి చెందిన కుమారి భవాని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు.ఇండియా-థాయిలాండ్ టెస్ట్ సిరీస్ మెన్ & ఉమెన్ 2025-26 బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఆసియా ఆధ్వర్యంలో మార్చి 11 నుండి 15 వరకు థాయిలాండ్‌లోని బ్యాంకాక్, పట్టాయా నగరాల్లో నిర్వహించబడింది.ఈ పోటీల్లో కుమారి భవాని తన ప్రతిభ,క్రీడా స్ఫూర్తి మరియు అంకితభావంతో అద్భుత ప్రదర్శన చేసి విజేతగా నిలిచారు. ఆమె సాధించిన ఈ ఘన విజయం భారతి నగర్ డివిజన్‌తో పాటు తెలంగాణ రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమని భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి గారు అభినందించారు.ఈ సందర్భంగా కుమారి భవానిని శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకురాలు రాణి యాదవ్ గారు పాల్గొన్నారు.

## లక్ష్మీపతి గూడెం ప్రధాన చౌరస్తాలో హై మస్ట్ లైట్లు ప్రారంభం



**జిన్నారం జూన్ 9**
**(వుదయం ప్రతినిధి)**

గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు లక్ష్మీపతి గూడెంలో సోమవారం రాత్రి మృగశిర కార్తె సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన హైమాస్టలైట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్ తో కలిసి వార్డ్ కౌన్సిలర్ కుమ్మరి కృష్ణ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ... వార్డులలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గ్రామ పెద్దలు యువకులు, పాల్గొన్నారు.

## అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ.... గవర్నర్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, జూన్**

దేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు తెలిపారు. ఇది ప్రధాని నాయకత్వంపై దేశ ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు లోక్ భవన్ మంగళవారం సాయంత్రం పత్రికా ప్రకటన విడుదల చేస్తుంది . ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికాభివృద్ధి, డిజిటల్ విప్లవం, మౌలిక సదుపాయాల విస్తరణ, అంతర్జాతీయ స్థాయిలో భారత ప్రతిష్ఠ పెంపు వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించిందని గవర్నర్ శివ ప్రతాప్ పేర్కొన్నార . జాతీయ ప్రయోజనాల పరిరక్షణలోనూ కేంద్ర ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధన దిశగా చేపడుతున్న కార్యక్రమాలు దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దనున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ మరిన్ని విజయాలు సాధించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. "తెలంగాణ ప్రజల తరఫున ప్రధాని నరేంద్ర మోదీకి కాంక్షలు తెలియజేస్తున్నాను. ఆయన నాయకత్వంలో దేశం మరింత ప్రగతి, సుసంపన్నత సాధించాలని ఆకాంక్షిస్తున్నాను" అని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రకటనలో పేర్కొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం..

**- 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన పటాన్చెరు ఎం ఎల్ ఎస్ పాయింట్ వే బ్రిడ్జి ప్రారంభం..**
**- అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ లోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు..**
**- పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్చెరు (వుదయం):**

రేషన్ డీలర్ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. స్టాక్ పాయింట్లో ధాన్యం తూకం వేసే సమయంలో డీలర్లు నష్టపోవద్దన్న లక్ష్యంతో పటాన్చెరులోని ఎంఎల్ఎస్ పాయింట్ లో 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటుచేసిన వే బ్రిడ్జిను మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. స్టాక్ పాయింట్లలో వే బ్రిడ్జి లేకపోవడం మూలంగా ధాన్యం ధూపం వేసే సమయంలో ప్రతిసారి నష్టపోతున్నామని గతంలో రేషన్ డీలర్లు తన దృష్టికి తీసుకునే రావడం జరిగిందని.. వెంటనే సొంత నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు చేయాల్సిన పని తాను చేయడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ స్టాక్ పాయింట్లలోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డీలర్లు కోరగా.. వచ్చే రెండు వారాల్లో బ్రిడ్జిల ఏర్పాటునకు శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జి లు ఏర్పాటు చేసి రేషన్ డీలర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రేషన్ డీలర్ల సంక్షేమం కోసం 15 లక్షల రూపాయలు సొంత నిధులతో వే బ్రిడ్జి ఏర్పాటు చేసిన ఘనత. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కే దక్కిందని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ప్రశంసించారు. తమ సంక్షేమం ఆర్థిక అభ్యున్నత కోసం అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అనంతం, జిల్లా ఉపాధ్యక్షులు జయప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## సొంతూరికి చేరిన సాహసకిశోరం అనురూప్ రెడ్డి

**కవాడిపల్లి, రంగారెడ్డి జిల్లా**

అమెరికాలో ముగ్గురు స్నేహితులను కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి భౌతికకాయం స్వగ్రామానికి చేరిక: ఘన నివాళులర్పించిన ఎంపి చామల,ఎమ్మెల్యేలు.. ప్రశంసా పత్రాన్ని పంపిన సీఎం రేవంత్ రెడ్డిరంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కవాడిపల్లి గ్రామానికి చెందిన కోదూరు అనురూప్ రెడ్డి భౌతికకాయం ఈరోజు (మంగళవారం) ఉదయం హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అమెరికాలోని లూసియానా టోరొడో పార్క్ (Toro Bayou Park) వద్ద సెబాన్ నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న తన ముగ్గురు స్నేహితులను ప్రాణాలకు తెగించి కాపాడి, దురదృష్టవశాత్తు తాను వలలో చిక్కుకుని ప్రాణాలు విడిచిన అనురూప్ రెడ్డి (23) అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య జరిగాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రశంసా పత్రంస్నేహితుల ప్రాణాలు కాపాడేందుకు అత్యంత సాహసోపేతంగా ప్రాణత్యాగం చేసిన తెలంగాణ ముద్దుబిడ్డ అనురూప్ రెడ్డి వీరత్వాన్ని కొనియాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా ఒక అధికారిక ప్రశంసా పత్రాన్ని పంపారు.

ముఖ్యమంత్రి తన సందేశంలో... "కేవలం 23 ఏళ్ల వయసులోనే ఎంతో ఉజ్వల భవిష్యత్తు ఉన్న అనురూప్, తోటి స్నేహితుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పుడు ఏమాత్రం వెనుకాడకుండా నీటిలోకి దూకి వారిని రక్షించడం అతని నిరుపమాన ధైర్యానికి, మానవత్వానికి నిదర్శనం. అనురూప్ చేసిన ఈ పరమోన్నత త్యాగం యావత్ తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకం. అతని త్యాగం తెలంగాణ గడ్డపై చెరిగిపోని ముద్ర వేసింది" అని కొనియాడారు. ప్రభుత్వం మరియు తెలంగాణ ప్రజల తరపున అనురూప్ తల్లిదండ్రులకు, అతని సోదరుడు ఆశ్రిత్ రెడ్డికి, కుటుంబ సభ్యులకు సిఎం రేవంత్ రెడ్డి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ కష్టసమయంలో ప్రభుత్వం కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి చొరవ:*అనురూప్ రెడ్డి భౌతికకాయం త్వరగా తెలంగాణకు వచ్చేలా *భువనగిరి లోక్ సభ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి* ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇండియన్ ఎంబసీ, తెలంగాణ ఎన్.ఆర్.ఐ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి స్వయంగా మానిటరింగ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రోటోకాల్ శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని విమానాశ్రయం నుండి స్వగ్రామమైన కవాడిపల్లికి తరలించారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అనురూప్ రెడ్డి తల్లిదండ్రులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.*ఘన నివాళులర్పించిన ఎంపి ఎమ్మెల్యేలు:* స్వగ్రామానికి చేరుకున్న అనురూప్ రెడ్డి భౌతికకాయాన్ని *భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు* *ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు శ్రీ మల్లారెడ్డి రంగారెడ్డి గారు* మరియు *తుంగతుర్తి శాసన సభ్యులు శ్రీ మందుల సామేల్ గారు* సందర్శించి, పూలమాలలు వేసి అంజలి ఘటించారు. స్నేహితుల కోసం ప్రాణాలర్పించిన అనురూప్ ధైర్యాన్ని వారు అభినందించారు.ఈ అంత్యక్రియల కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

## బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఎంపికకు లక్కీ డిప్

**- జిల్లా షెడ్యూల్డు అభివృద్ధి అధికారి నుషిత**

**గద్వాల జూన్ 09**
**(వుదయం కరస్పాండెంట్)**




2026-27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ నాన్‌రెసిడెన్షియల్, రెసిడెన్షియల్ పథకం కింద అందిన దరఖాస్తుల ఎంపికకు లక్కీ డిప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1వ తరగతికి నాన్‌రెసిడెన్షియల్ విభాగంలో 57 సీట్లకు గాను (264) మరియు 5 తరగతిలో (రెసిడెన్షియల్) విభాగంలో 59 సీట్లకు గాను (310) దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అర్హుల ఎంపిక కోసం ఈ నెల 12వ తేదీన ఉదయం 11.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం (IDOC) లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషషేక్ అధ్యక్షతన లక్కీ డిప్ కార్యక్రమం నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాల్సిందిగా

జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి తెలిపారు.

## జిన్నారం తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన ఆంథోనీ



**జిన్నారం జూన్ 9**
**(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని నూతన తహశీల్దార్ ఆంథోనీ అన్నారు. సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చిన ఆయన జిన్నారం తహశీల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. గత తహశీల్దార్ దేవదాస్ ఆర్డీవోగా పదోన్నతి పొంది నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తాసిల్దారుగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆంటోనీకి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన సంపూర్ణ సహకారాన్ని అందిస్తానన్నారు. కాగా నూతన తాసిల్దార్ పలువురు మండల ప్రజా ప్రతినిధులు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.


దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని @ SCRailwayIndia అనుసరించండి
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

**ఇ-టెండరు ప్రకటన నం. C-SG-PT-IPMPLS-SC-NED-02, తేది.05.05.2026 కు సవరణ నం.2, తేది.05.06.2026**

PUB/350

భారత రాష్ట్రపతి తరఫున Dy. CSTE/ Projects/ Tele/ SC వారు దిగువ తెలిపిన పని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. **టెండరు నం. మరియు తేది:** C-SG-PT-IPMPLS-SC-NED-02, తేది: 05.05.2026, (సవరణ నం.2, తేది:05.06.2026) **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ మరియు నాందేడ్ డివిజన్లలో IP-MPLS ఏర్పాటు కొరకు టెలికమ్యూనికేషన్ పనులు. **అంచనా ప్రాజెక్ట్ వ్యయం:** రూ.16,23,90,243.96. **బిడ్ సెక్యూరిటీ:** రూ.32,47,800, **పని పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ ముగింపు తేది (బిడ్ గడువు తేది):** 22.06.2026న 11.00 గం.లకు. **బిడ్ తెరుచు తేది:** 22.06.2026న 11.00 గం.ల తర్వాత, **ఆఫర్ చెల్లుబాటు:** బిడ్ ముగింపు తేదీ నుండి 120 రోజులు. **టెండరు బుక్‌లెట్ ధర:** రూ.0/- **బిడ్ ముగింపు తేది పొడగింపుకు కారణం:** బిడ్డర్ల అభ్యర్థన మేర.

అన్ని బిడ్డింగ్‌లు ఇండియన్ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో ఉన్నవి. ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమ తించబడవు.
తదుపరి వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చును.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికం ఇంజినీర్/ ప్రాజెక్ట్స్/ టెలి/ సికింద్రాబాద్

**ఇ-టెండరు ప్రకటన నం. C-SG-PT-IPMPLS- BZA-GTL-GNT-03, తేది.05.05.2026కు సవరణ నం.2, తేది.05.06.2026**

PUB/351

భారత రాష్ట్రపతి తరఫున Dy. CSTE/ Projects/ Tele/ SC వారు దిగువ తెలిపిన పని కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

1. **టెండరు నం. మరియు తేది:** C-SG-PT-IPMPLS-BZA-GTL-GNT-03, తేది: 05.05.2026, (సవరణ నం.2, తేది:05.06.2026) **పని పేరు:** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ, గుంతకల్ మరియు గుంటూరు డివిజన్లలో IP-MPLS ఏర్పాటు కొరకు టెలికమ్యూనికేషన్ పనులు. **అంచనా ప్రాజెక్ట్ వ్యయం:** రూ.31,18,34,709.27/- **బిడ్ సెక్యూరిటీ:** రూ.62,36,700/- **పని పూర్తి చేయు కాలం:** 12 నెలలు. **బిడ్ ముగింపు తేది (బిడ్ గడువు తేది):** 22.06.2026న 11.00 గం.లకు. **బిడ్ తెరుచు తేది:** 22.06.2026న 11.00 గం.ల తర్వాత, **ఆఫర్ చెల్లుబాటు:** బిడ్ ముగింపు తేదీ నుండి 120 రోజులు. **టెండరు బుక్‌లెట్ ధర:** రూ.0/- **బిడ్ ముగింపు తేది పొడగింపుకు కారణం:** బిడ్డర్ల అభ్యర్థన మేర.

అన్ని బిడ్డింగ్ భారతీయ రైల్వే ఇ-టెండరింగ్ పోర్టల్ www.ireps.gov.in లో ఉన్నవి. ఈ టెండరుపై మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు.
తదుపరి వివరాలను www.ireps.gov.in లో చూడవచ్చును.
డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికం ఇంజినీర్/ ప్రాజెక్ట్స్/ టెలి/ సికింద్రాబాద్
A418

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.


## యాప్ ఆధారిత ఎరువుల విక్రయాలపై రైతుల ఆగ్రహం

**- రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానం వెంటనే ఉపసంహరించాలి: ఎన్ను గోవర్ధన్ రెడ్డి**

**చేవెళ్ల, జూన్ 09 (వుదయం)**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన కీలక సమయంలో రైతులకు అవసరమైన ఎరువులు అందకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న యాప్ ఆధారిత విధానం తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన రైతు నాయకుడు ఎన్ను గోవర్ధన్ రెడ్డి విమర్శించారు.ఫర్టిలైజర్ దుకాణాలు, గోదాముల్లో ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉన్నప్పటికీ రైతుల చేతికి మాత్రం ఒక్క సంచి కూడా సులభంగా అందని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువులు కొనుగోలు చేయాలంటే తప్పనిసరిగా యాప్‌లో బుకింగ్ చేయాలని ప్రభుత్వం నిబంధన పెట్టడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.యాప్ డౌన్‌లోడ్ కావడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, డౌన్‌లోడ్ అయినా ఎకరానికి ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని చెప్పడం రైతులకు అన్యాయమని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరానికి ఒక బస్తా ఎరువు ఏమాత్రం సరిపోదని పేర్కొన్నారు.ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్‌లు లేని చిన్న, సన్నకారు రైతులు ఎరువులు పొందలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రైతులకు సహకరించాల్సిన సమయంలో ఇలాంటి నిబంధనలతో ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. యాప్ విధానం కారణంగా ఫర్టిలైజర్ దుకాణదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, యాప్ లేకుండా ఒక్క బస్తా కూడా విక్రయించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతుల అవసరాలు, వ్యవసాయ పనుల అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని యాప్ ఆధారిత ఎరువుల విక్రయ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానంలో ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా చేయకపోతే రైతుల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించాలని, వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే నిర్ణయాలను పునఃసమీక్షించాలని ఆయన కోరారు.ముఖ్యాంశాలుయాప్ ఆధారిత ఎరువుల విక్రయాలపై రైతుల అసంతృప్తిగోదాముల్లో నిల్వలు ఉన్నా రైతులకు అందని ఎరువులుస్మార్ట్‌ఫోన్ లేని రైతులకు తీవ్ర ఇబ్బందులుఎకరానికి ఒక్క బస్తా నిబంధనపై ఆగ్రహంవెంటనే యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్లేనిపక్షంలో రైతుల ఆధ్వర్యంలో భారీ ఆందోళనలకు హెచ్చరిక

## మహానేత పుట్టపాగ మహేంద్రనాథ్‌కు శతజయంతి నివాళి

**- నేడు నాగర్ కర్నూల్ లో ఘన ఉత్సవం**

**నాగర్ కర్నూల్, జూన్ 09**
**(వుదయం బ్యూరో)**



ప్రజల కోసం జీవించిన మహానేత, మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ శతజయంతి ఉత్సవాలు నేడు జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఉదయం 10 గంటలకు జరుగనున్నాయి. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, సమాజానికి సేవ చేసిన ప్రముఖ వృద్ధులు, సామాజిక సేవకులు, వివిధ రంగాల్లో రాణించిన ప్రముఖులను పుట్టపాగ మహేంద్రనాథ్ స్మారకార్థం ఘనంగా సన్మానించనున్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కుచూకుల దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొననుండగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సి. ఖాసీమ్ అధ్యక్షత వహిస్తారు. "మహేంద్రనాథ్ గారి ఆశయాలకు మనమందరం వారసులం. ఆయన అభిమానులు, మేధావులు, ప్రజలంతా అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి" అని ఉత్సవాల కమిటీ కన్వీనర్ పుట్టపాగ శ్రీనివాసులు మంగళవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు

## ఇంధన ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ 'మహా నిరసన ర్యాలీ'




**కేంద్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**

**హైదరాబాద్, జూన్ 09**
**(వుదయం ప్రతినిధి) :**

గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆధ్వర్యంలో మంగళవారం రోజున గాంధీ భవన్ నుండి గన్ పార్క్ వరకు 'మహా నిరసన ర్యాలీ' నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ సందర్భంగా మహిళా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూసామాన్యులపై భారం, ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను ఏకంగా నాలుగు సార్లు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ నెపంతో ఒకే నెలలో పలుమార్లు ఇంధన ధరలు పెంచడం దుర్మార్గమన్నారు.కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ..: కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న అధిక ఎక్సైజ్ డ్యూటీ వల్లే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, బడా కార్పొరేట్ సంస్థల లాభాల కోసమే పేద ప్రజల రక్తాన్ని పిండుతున్నారని విమర్శించారు.మహిళల వంటింటి బడ్జెట్ పై, ఇంధన ధరల పెంపు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయి, మహిళల వంటింటి బడ్జెట్ అస్తవ్యస్తమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో సిలిండర్ ధర తక్కువగా ఉన్నప్పుడే రోడ్లపైకి వచ్చి నాటకాలు ఆడిన బీజేపీ నాయకులు, ఇప్పుడు ధరలు వెయ్యి రూపాయలు దాటినా నోరు మెదపకపోవడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'మహాలక్ష్మి పథకం' ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెడుతుంటే, కేంద్రం మాత్రం ధరలు పెంచుతూ వేధిస్తోందని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో మహిళా శక్తి ఏంటో చూపిస్తూ దేశ వ్యాప్త పోరాటాలను ఉధృతం చేస్తామని ఎర్రబెల్లి స్వర్ణ హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు, రాష్ట్ర మహిళా కార్యవర్గ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళా కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ చేయించాలి వాహనాలకు ఉన్న ఎల్ ఈ డి బల్బులను తొలగిస్తాం

**-- ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలి**
**--నారాయణపేట ఆర్టీవో షేక్ మున్ని**

**నారాయణపేట జూన్09**
**(వుదయం ప్రతినిధి)**




నారాయణపేట జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల యజమానులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వారి పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ చేయించాలని నారాయణపేట ఆర్టీవో షేక్ ముని అన్నారు. నారాయణపేట ఆర్టీవో కార్యాలయానికి బదిలీపై వచ్చిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15న పాఠశాలల పున ప్రారంభం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలలో ఉన్న బస్సులకు యజమానులు పూర్తి ఫిట్నెస్ చేయించుకోవాలని లేదంటే ఆ పాఠశాల బస్సులపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, శిక్షణ పొందిన డ్రైవర్లతో బస్సులను నడపాలని లేదంటే వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటాం అన్నారు. యజమానులు వెంటనే స్పందించి ఆర్టీవో కార్యాలయానికి వారి బస్సులను తీసుకువచ్చి ఫిట్నెస్ చేయించుకోవాలని సూచించారు. ఫిట్నెస్ సర్టిఫికేట్ లేనిదే పాఠశాలల బస్సులు నుండి వచ్చే వారికి తీవ్ర ఇబ్బంది అవుతుందని వెంటనే వాటిని తొలగించాలని ఇది చట్టరీత్యా నేరమని ఆమె సూచించారు.కాగా ఎల్ఈడి బల్బులు, డబుల్ సైలెన్సర్ ఉన్న వాహనాలను తనిఖీ చేసి వాటిని సైతం సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాకాలము సందర్భంగా ప్రయాణికులతో వివిధ గ్రామాలకు వెళ్లే ఆటోలు చెట్ల కింద ఆపరాదని ఉరుములు మెరుపులు వచ్చినప్పుడు ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని దీనిని దృష్టిలో ఉంచుకొని ఆటో యజమానులు, డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో 80 శాతం వాహనాలకు చాలానాలు విధించారని వాటిని నేటి వరకు చెల్లించలేదని వారు వెంటనే మీ సేవల ద్వారా చెల్లించి వాహనాలను నడుపుకోవాలని అన్నారు.లేదంటే వారి వాహనాలపై దాడులు నిర్వహించి సీజ్ చేస్తామని వెంటనే ఆన్లైన్ ద్వారా చెల్లించి వాటికి సంబంధించిన రసీదులను పొందాలన్నారు. కాగా పొలం పనులు ప్రారంభం అవుతున్న సందర్భంగా వివిధ ట్రాక్టర్ల యజమానులు సైతం చాలానాలు చెల్లించలేదని వారికి వెంటనే నోటీసులు పంపిస్తామని సూచించారు. లేదంటే మీ సేవ ద్వారా చాలానాలు చెల్లించి వాటికి సంబంధించిన రసీదులను పొందాలన్నారు. చాలానాలు చెల్లించని ట్రాక్టర్లు రోడ్డుపై కనిపిస్తే వాటిని సీజ్ చేస్తామని ఇది యజమానులు గమనించాలన్నారు. మైనర్ల తల్లిదండ్రులు చిన్నారులకు చక్ర వాహనాలను ఇవ్వరాదని వారు సరిగా నడపని వేల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ , కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించి డ్రైవింగ్ చేసి సురక్షితంగా ప్రయాణించి గమ్యాలకు చేరుకోవాలని ఆర్టీవో షేక్ మున్ని పలు సలహాలు సూచనలు ఇచ్చారు.

## గ్రామీణ పేదలకు ఆదాయం పెంచడానికే... బీజేపీ

**వికారాబాద్, జూన్ 09;**
**(వుదయం బొంరాస్ పేట ప్రతినిధి):**



బొంరాస్ పేట: గ్రామీణ పేదలకు మరింత ఆదాయం పెంచడానికే మోదీ నేతృత్వం లోని కేంద్ర ప్రభుత్వం "వికసిత్ భారత్ జీ రామ్ జీ"పథకాన్ని అమలు చేస్తున్నదని భాజాపా మండల అధ్యక్షుడు జగదీష్ సాగర్ తెలిపారు. మంగళ వారం మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పాత చెరువు దగ్గర ఆ పథకం ద్వారా చేపట్టిన పనులను అక్కడ కూలీల కోసమై ఏర్పాటు చేసిన వసతులను మండల ముఖ్య నేతలు మరియు కార్యకర్తలతో కలసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ పనిచేస్తున్న రైతులకు కూలీలకు వేసవి తాపం నుండి ఊరట చెందడానికి మజ్జిగ పాకెట్లు బారాస శ్రేణులు పంపిణీ చేశారు.అనంతరం వారికి కేంద్ర ప్రభుత్వం సవరణ చేసి అమలు చేస్తున్న వికసిత భారత్ జీ రాం జీ పథకం గురించి ఆ పార్టీ మండల అధ్యక్షుడు అవగాహన కల్పించాడు.ప్రతి గ్రామీణ పేదరిక కుటుంబానికి పని దినాలు పెంచి సంవత్సరానికి 100 రోజుల నుండి 125 రోజుల పనికి హామి , డిజిటల్ హాజరు, వేగవంతం గా వేతనాల చెల్లింపు,పని కోరిన పదిహేను రోజుల్లో పని కల్పించక పోతే వారికి ఉపాధి భృతి ఇలా పథకం ద్వారా చేకూరే లబ్ధి గురించి ఆయన వారికి అవగాహన కల్పిస్తూ,ప్రతి పేద కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సందర్భనలో మండల బారాస మాజీ అధ్యక్షుడు చాకలి నర్సింలు, ఉప్పు జగదీశ్వర్, రాజారాం రెడ్డి, గణేష్నాయక్, దప్పు జనార్ధన్, పుట్టి శ్రీనివాస్, సతీష్, నారాయణ గౌడ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


**IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE-CUM VI JMFC: MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT:MEDIPALLY**
**O.S.NO. 370 of 2026**

**BETWEEN :**
Arravalli Bikshapathi and Another
...**Plaintiffs**
**AND**
1. The Tahsildar, Uppal Mandal,
2. All Concerned
....DEFENDANT No.1
...DEFENDANT No.2

To
ALL CONCERNED
Please take notice that the Plaintiffs herein filed the above suit against Tahsildar Abdullapurmet Mandal and All concerned for Declaration to declare the Plaintiffs as the legal heirs of Late Arravalli Lingaiah@Avusala Lingaiah. The above case is posted to 07-08-2026 for your appearance. Therefore, the general public hereby informed that if anybody having objections you may appear before the Hon'ble Prl. Junior Civil Judge At: Medipally Court on 07-08-2026 at 10.30 A.M either in person or through an Advocate, otherwise, the matter will be decided in your absence as exparte.

**(BY ORDER OF THE HONOURABLE COURT)**

Sd/-
**E. MALLESH**
**Advocate**
**#3-163, Near Registration office, Pedda Amberpet, AbdullapurmeMandal, Ranga Reddy District.**
**Counsel for the Plaintiffs.**

# చక్కని ఆరోగ్యం


## రొమ్ము క్యాన్సర్ గురించి మహిళలు తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..!



రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం చికిత్స విజయావకాశాలను గణనీయంగా పెంచుతుంది. అయితే ప్రారంభ దశ అనే పదం వినగానే చాలా మంది మహిళలు పూర్తిగా ప్రమాదం తొలగిపోయిందని భావిస్తారు. వాస్తవానికి చికిత్స ప్రారంభమైన తర్వాత కూడా పునరావృతం అయ్యే అవకాశాలు, దీర్ఘకాలిక ఆరోగ్య నిర్వహణ, మానసిక ఆరోగ్యం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని నిపుణులు చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రారంభ దశలో గుర్తించిన రొమ్ము క్యాన్సర్‌కు చికిత్స సమర్థవంతంగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో క్యాన్సర్ మళ్లీ వచ్చే ప్రమాదం పూర్తిగా ఉండదని చెప్పలేం. క్యాన్సర్ కణాల జీవశాస్త్ర లక్షణాలు, వ్యాధి స్వభావం, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా పునరావృత ప్రమాదం మారుతూ ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఈ ప్రమాదం 50 శాతం వరకు ఉండే అవకాశం కూడా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే అదనపు చికిత్సలు సూచించడం వ్యాధి తీవ్రమైందని కాదు, భవిష్యత్తు ప్రమాదాన్ని తగ్గించే ప్రయత్నమని నిపుణులు వివరిస్తున్నారు. ఇటీవలి కాలంలో రొమ్ము క్యాన్సర్ చికిత్సలో అనేక ఆధునిక విధానాలు అందుబాటులోకి వచ్చాయి. హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ మెడికేషన్ వంటి చికిత్సలు క్యాన్సర్ తిరిగి వచ్చే అవకాశాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అదే సమయంలో రోగుల జీవన నాణ్యతను కూడా కాపాడటానికి సహాయపడుతున్నాయి. చికిత్స ఎంపికల గురించి వైద్యులతో స్పష్టంగా చర్చించడం, తమకు అనుకూలమైన ఆధునిక చికిత్సలపై సమాచారం తెలుసుకోవడం రోగులకు ఉపయోగకరంగా ఉంటుంది. చికిత్సలో అత్యంత కీలకమైన అంశం నిరంతర అనుసరణ. ప్రధాన చికిత్స పూర్తయ్యాక ఆరోగ్యం మెరుగుపడిందని భావించి చాలామంది ఫాలోఅప్ పరీక్షలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంటుంది. అయితే దీర్ఘకాలిక చికిత్సలు, క్రమం తప్పకుండా జరిగే వైద్య పరీక్షలు ఆరోగ్య ఫలితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయి. ఫాలోఅప్‌ల ద్వారా వైద్యులు శరీరంలో జరిగే మార్పులను గమనించడంతోపాటు దుష్ప్రభావాలను నియంత్రించవచ్చు. అవసరమైతే ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకోవచ్చు. రొమ్ము క్యాన్సర్ నుంచి కోలుకోవడం అనేది కేవలం శారీరక ప్రక్రియ మాత్రమే కాదు. మానసిక ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, ఉద్యోగ జీవితం, భవిష్యత్తు లక్ష్యాలు కూడా ఇందులో ముఖ్యమైన భాగాలే. క్యాన్సర్ మళ్లీ వస్తుందేమోనన్న భయం, జీవనశైలిలో మార్పులు, భావోద్వేగ ఒత్తిడి వంటి అంశాలు చాలామంది మహిళలను ప్రభావితం చేస్తాయి. అందువల్ల చికిత్సతోపాటు భావోద్వేగ మద్దతు, కౌన్సెలింగ్, కుటుంబ సహకారం కూడా సమానంగా అవసరమవుతాయి. ప్రారంభ దశలో గుర్తించిన రొమ్ము క్యాన్సర్‌కు చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అయితే చికిత్స పూర్తయ్యిందంటే ప్రయాణం ముగిసినట్టుకాదు. దీర్ఘకాలిక ఆరోగ్య సంరక్షణ, క్రమమైన వైద్య పర్యవేక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం ద్వారా మహిళలు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగవచ్చు. ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా జీవన నాణ్యతను కూడా కాపాడుకోవడం ఈ ప్రయాణంలో అత్యంత ముఖ్యమైన అంశంగా వైద్యులు సూచిస్తున్నారు.

## ఐరన్ అందాలంటే..



మనం తినే ఆహారంలో ఐరన్ ఎంత ఉందనేదాని కన్నా, ఆ ఐరన్‌ను మన శరీరం ఏ మేరకు లోపలికి గ్రహిస్తున్నది అనేదే ముఖ్యం. ఎంత మంచి ఆహారం తీసుకున్నా శోషణ సరిగా లేకపోతే ప్రయోజనం శూన్యం. ఈ సమస్యకు చెక్ పెడుతూ, శరీరంలో ఐరన్ శోషణను వేగవంతం చేసి హిమోగ్లోబిన్‌ను పెంచే ఆ చిట్కాలేమిటో తెలుసుకుందాం.. జీర్ణక్రియను మెరుగుపరచడం: ఐరన్‌ను శరీరం పూర్తిగా గ్రహించాలంటే మన జీర్ణక్రియ అద్భుతంగా ఉండాలి. ముఖ్యంగా జీర్ణాశయంలో ఉండే స్టమక్ యాసిడ్ పరిమాణం సరిగ్గా ఉండటం ముఖ్యం. అప్పుడే మనం తినే ఆహారం బాగా జీర్ణమై అందులోని పోషకాలు అందుతాయి. అందుకోసం ఒక చిన్న అల్లం ముకను నిమ్మరసంలో అరగంట పాటు నానబెట్టాలి. భోజనం చేయడానికి సరిగ్గా పది నిమిషాల ముందు ఆ అల్లం ముకను బాగా నమిలి తినాలి. ఇది మీ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

పేగులపై ఫోకస్: ఐరన్ లోపాన్ని అధిగమించాలంటే ముందుగా పేగుల ఆరోగ్యం బాగుండాలి. ఎందుకంటే పేగుల ఆరోగ్యమే శరీరంలోని మిగిలిన అన్ని అవయవాల పనితీరును నియంత్రిస్తుంది. నిరంతరం కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలతో సతమతమవుతుంటే వెంటనే వాటిని నయం చేసుకోవాలి. పేగులు ఆరోగ్యంగా లేకపోతే ఐరన్ శోషణ అంతగా జరగదు.

ఐరన్ మాత్రమే కాదు: శరీరంలో రక్తం తకువగా ఉందని కేవలం ఐరన్ ఎకువగా ఉండే ఆహారాలు మాత్రమే తింటే ఫలితం ఉండదు. ఆహారం ఎల్లప్పుడూ సమతుల్యంగా ఉండాలి. ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి ఐరన్‌తో పాటు ప్రొటీన్, విటమిన్ బీ12, బీ6 వంటి పోషకాలు కూడా ఎంతో అవసరం. వాపులకు విరుగుడు: ఈ రోజుల్లో జంక్‌ఫుడ్ తినడం, అనారోగ్యకరమైన జీవనశైలి, విపరీతమైన మానసిక ఒత్తిడి, నిద్రలేమి కారణంగా శరీరంలో అంతర్గత వాపులు పెరుగుతున్నాయి. ఇవి కాలేయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. కాలేయంపై ఒత్తిడి పడితే ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. కాబట్టి ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. దీనివల్ల కాలేయం తనను తాను డిటాక్స్ చేసుకునే అవకాశం లభిస్తుంది. తిండిలో మార్పు: మీ ఆహారంలో కాకరకాయ, చేదు కూరగాయల సూప్స్ వంటి పదార్థాలను చేర్చుకోండి. ఇవి కాలేయ పనితీరును మెరుగుపరిచి శరీరంలో ఐరన్ శోషణను పెంచుతాయి.

ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని తింటున్నప్పుడు, దాంతో పాటు ఏ ఆహారాన్ని కలిపి తీసుకుంటున్నారనేది చాలా ముఖ్యం. ఐరన్ శరీరానికి పట్టాలంటే దానికి విటమిన్ సి తోడు కావాలి. అప్పుడే ఆహారంలోని ఐరన్‌ను శరీరం పూర్తిగా శోషించుకోగలదు.

## జాగింగ్ పేరుతో రన్నింగా!?

జాగింగ్ అంటేనే.. సౌకర్యంగా పరిగెత్తడం. స్థిరమైన, తక్కువ వేగాన్ని మెయింటెయిన్ చేయడం. వ్యాయామం చేస్తున్నప్పుడు ఆయాసం లేకుండా పక్కవారితో మాట్లాడగలుగుతుంటే.. అది 'సౌకర్యవంతమైన వేగం' అని అర్థం చేసుకోవాలి. కొత్తగా వ్యాయామం మొదలుపెట్టే వారికి, బరువు తగ్గాలనుకునే వారికి, గుండె ఆరోగ్యం మెరుగు పడాలనుకునే వారికి.. జాగింగ్ మేలు చేస్తుంది.జాగింగ్ అంటేనే.. సౌకర్యంగా పరిగెత్తడం. స్థిరమైన, తక్కువ వేగాన్ని మెయింటెయిన్ చేయడం. వ్యాయామం చేస్తున్నప్పుడు ఆయాసం లేకుండా పక్కవారితో మాట్లాడగలుగుతుంటే.. అది 'సౌకర్యవంతమైన వేగం' అని అర్థం చేసుకోవాలి. కొత్తగా వ్యాయామం మొదలుపెట్టే వారికి, బరువు తగ్గాలనుకునే వారికి, గుండె ఆరోగ్యం మెరుగు పడాలనుకునే వారికి.. జాగింగ్ మేలు చేస్తుంది. అలా కాకుండా, వేగంగా పరిగెడితే.. అది రన్నింగ్ అవుతుంది. సాధారణ వ్యాయామం కాకుండా పోతుంది. ఇది అథ్లెట్లు, కండరాల సామర్థ్యం పెరగాలనుకునే వారికే ప్రయోజనం కలిగిస్తుంది. అయితే, ఇందుకు తగినంత ప్రాక్టీస్ కావాలి. సాధారణ వ్యక్తులు సరైన పద్ధతి పాటించకుండా రన్నింగ్ చేస్తే.. లేనిపోని ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. వేగంగా పరిగెత్తినప్పుడు పాదాలు, మోకాళ్లు, తుంటి కీళ్లపై అధిక ఒత్తిడి పడుతుంది.ఇది శరీర బరువు కంటే 3 నుంచి 4 రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఇలా ఎముకలపై నిరంతరం ఒత్తిడి పడితే.. చిన్నచిన్న పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. 'రన్నర్స్ నీ' అని పిలిచే ఈ సమస్యకు చికిత్స తీసుకోకపోతే.. దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతుంది. వేగంగా పరిగెత్తేటప్పుడు శరీరానికి ఎక్కువ ఆక్సిజన్ అవసరం పడుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్యం తక్కువగా ఉన్నవారు,



ధూమపానం అలవాటు ఉన్నవారు అతివేగంగా పరిగెడితే.. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతారు.

శరీరం సిద్ధంగా లేనప్పుడు అకస్మాత్తుగా వేగాన్ని పెంచడం మంచిది కాదు. అలాచేస్తే.. మెడ, వెన్ను, కాళ్లలో కండరాలు పట్టేస్తాయి. జాగింగ్‌లో వేగం ఎక్కువైతే.. శరీరం కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్నిసార్లు తీవ్రమైన నీరసం, నిద్రలేమి, మానసిక ఆందోళన, చిరాకు లాంటి సమస్యలూ చుట్టుముడతాయి.

అలవాటు లేనివారు ఒకేసారి వేగంగా పరిగెత్తడం వల్ల గుండె వేగం అకస్మాత్తుగా పెరుగుతుంది. రక్తపోటు ఉన్నవారికి, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరం. తీవ్రమైన సందర్భాల్లో గుండెపోటుకు కూడా దారి తీస్తుంది. జాగింగ్ మాత్రమే చేయాలనుకునేవారు కచ్చితంగా సౌకర్యవంతమైన వేగంతోనే మొదలుపెట్టాలి. శరీరం అలవాటు పడ్డాక క్రమంగా వేగాన్ని పెంచవచ్చు. ఇక మొత్తం వర్కవుట్‌లో 80 శాతం సౌకర్యంగా, నెమ్మదిగా పరిగెత్తాలి. కేవలం 20 శాతం సమయం మాత్రమే వేగంగా పరిగెత్తడం మంచిది.


## కాఫీతో గుండెకు రక్ష

మారిన జీవనశైలిలో గుండె జబ్బుల ముప్పు నానాటికీ పెరుగుతున్నది. అయితే, మనం రోజూ తాగే కాఫీ గుండెను పదిలంగా ఉంచుతుందని సరికొత్త పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. రోజుకు రెండునుంచి మూడు కప్పుల కాఫీ తాగడం వల్ల గుండె జబ్బుల ముప్పు గణనీయంగా తగ్గుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ బేకర్ హార్ట్ అండ్ డయాబెటిస్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ ప్రతిష్ఠాత్మక పరిశోధనను నిర్వహించారు.



బ్రిటన్‌కు చెందిన 'యూకే బయోబ్యాంక్' నుంచి సేకరించిన దాదాపు నాలుగున్నర లక్షల మంది డేటాను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చారు. దాదాపు పన్నెండున్నర సంవత్సరాల పాటు వీరి ఆరోగ్య అలవాట్లను, కాఫీ వినియోగాన్ని పరిశోధకులు నిశితంగా గమనించారు. ఈ సుదీర్ఘ అధ్యయనంలో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగుచూశాయి. రోజుకు 2–3 కప్పుల కాఫీ తాగే వారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం, కాఫీ తాగని వారి కంటే 20% తక్కువగా ఉన్నట్లు తేలింది. గ్రౌండ్ కాఫీ, ఇన్‌స్టంట్ కాఫీ లేదా డీకాఫిన్ అంటే కెఫిన్ తీసేసిన కాఫీ... రకం ఏదైనా సరే, కాఫీ క్రమం తప్పకుండా తాగే వారిలో అకాల మరణాల రేటు చాలా తక్కువగా ఉంది. ఇక, కాఫీలో కేవలం కెఫిన్ మాత్రమే కాదు, శరీరంలో వాపులను తగ్గించే, జీవక్రియలను మెరుగుపరిచే 100కు పైగా జీవసంబంధిత సమ్మేళనాలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. అయితే... చక్కెర, పాలు అతిగా లేకుండా బ్లాక్ కాఫీ లేదా తక్కువ మోతాదు పాలతో తీసుకుంటే ఈ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## గంటలతరబడి కుర్చీలో కూర్చుంటున్నారా..



ఆధునిక యుగంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తుల్లో కొంతమంది గంటల తరబడి కుర్చీలకే పరిమితమవుతున్నారు. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి అంటున్నారు వైద్య నిపుణులు. దీన్నే 'సిట్టింగ్ డిసీజ్' అని పిలుస్తున్నారు. ఈ సిట్టింగ్ డిసీజ్ ఇతర రోగాలకన్న ప్రమాదకరమైనది. చాపకింద నీరులా.. అనా రోగ్య సమస్యల్ని మరింత తీవ్రం చేస్తుంది. ఒకే చోట గంటల తరబడి కూర్చోవడం వల్ల వెన్నెముకపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ఫలితంగా నడుము, మెడ నొప్పులు వస్తాయి. అలాగే శారీరక శ్రమ లేకపోవడం వల్ల క్యాలరీలు ఖర్చు కాక స్థూలకాయానికి దారి తీస్తుంది. రక్తప్రసరణ మందగించి, గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోలేదు. దీనివల్ల టైప్–2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు స్క్రీన్‌లను నిరంతరం చూడటం వల్ల కళ్లు పొడిబారడం, తలనొప్పి అదనంగా వచ్చే అనారోగ్య సమస్యలు. అయితే, ఎంత సేపు కూర్చుంటే, ఎంత ప్రమాదం ఉంటుందనే విషయంలో కొన్ని లెక్కలు చెబుతున్నారు నిపుణులు. రోజుకి 4 గంటలోపు కూర్చుంటే.. ప్రమాద తీవ్రత కాస్త తక్కువే ఉంటుందట. అదే 4 – 8 గంటలు కూర్చోవడంతో మధ్యస్థ ప్రమాదంగా చెప్పవచ్చు. 8– 11 గంటలు పాటు కూర్చోవడంతోనే మరింత ఎక్కువ ప్రమాదానికి దారి తీస్తుందంటున్నారు. రోజుకి 11 గంటల కంటే ఎక్కువ సమ యం కూర్చోవడం అంటే ప్రమా దం అంచున ఉన్నట్టే. ఎంతలా అంటే.. హఠాత్తుగా గుండెపోటు రావడం, పక్షవాతం, శరీరం చలించకపోవటంవంటి సమస్యలు వస్తాయి. ఈ ప్రమాదంనుంచి మనల్ని మనం రక్షించుకోవాలంటే కనీసం వ్యాయామం తప్పనిసరి. క్రమం తప్పని వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. 20–20–20 నియమం: ప్రతి 20 నిమిషాలకు ఒకసారి స్క్రీన్ చూడటం ఆపాలి. 20 సెకన్ల పాటు 20 అడుగుల దూరంలోని వస్తువును చూడటం వల్ల కంటి రెటినా పొర చల్లబడుతుంది. చిన్న విరామాలు: ప్రతి గంటకు కనీసం 5 నిమిషాలు సీటు నుండి లేచి నడవాలి. దాంతో శరీర కండరాల్లో కదలిక వల్ల రక్త ప్రసరణ సక్రమంగా సాగుతుంది.

సరైన భంగిమ: వెన్నుముక నిటారుగా ఉండేలా కుర్చీలో కూర్చోవాలి. వెన్నుముక వంపుగా ఉంచి.. కుర్చీని ఆనుకుని ఉండటం వల్ల శరీరం మొద్దుబారి, మెదడు నిద్దురను కోరుకుంటుంది.

స్క్రీన్ ఎత్తు: కంప్యూటర్ మానిటర్ మన కంటి ఎత్తుకు సమానంగా ఉండేలాగా చూసుకోవాలి. దీంతో మెడ కండరాల్లో నొప్పి రాకుండా ఉంటుంది.

శారీరక వ్యాయామం: మెడ, చేతులు అలాగే నడుమును క్రమంగా స్ట్రెచ్ చేస్తూనే ఉండాలి.

## ఫిట్‌నెస్ కోసం భోజనం మానేస్తున్నారా? జాగ్రత్త..



ఈ రోజుల్లో త్వరగా బరువు తగ్గాలనే ఉద్దేశంతో చాలా మంది అల్పాహారం మానేయడం, భోజనాన్ని ఆలస్యం చేయడం లేదా రోజంతా కేవలం టీ, కాఫీ లేదా జ్యూస్‌లపై ఆధారపడడం చేస్తున్నారు. కానీ ఇది ఆరోగ్యకరమైన పద్ధతి కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పగటి పూట తగినంత ఆహారం తీసుకోకపోతే సాయంత్రం సమయంలో ఎక్కువ ఆకలి వేస్తుంది. దీంతో రాత్రి పూట అధికంగా తినడం లేదా జంక్ ఫుడ్ తినే అవకాశం పెరుగుతుంది. ఇది జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే ఉపవాసం చేయడం లేదా భోజనం మానేయడం ఫిట్‌నెస్‌కు పరిష్కారం కాదని నిపుణులు చెబుతున్నారు. భోజనం మానేయడం కంటే సమతుల్య ఆహారం తీసుకోవడం చాలా మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఆహారంలో ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించి వ్యాయామ సామర్థ్యాన్ని పెంచుతాయి. త్వరగా బరువు తగ్గాలనే ఉద్దేశంతో చేసే క్రాష్ డైట్‌లు, డిటాక్స్ టీల వంటి పద్ధతులు దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హానికరంగా మారవచ్చు. శరీరానికి అవసరమైన పోషకాలు అందించే సమతుల్య ఆహారమే నిజమైన ఫిట్‌నెస్‌కు దారి చూపుతుంది. సరైన సమయానికి తినడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, తగినంత నీరు తాగడం, మంచిగా నిద్రపోవడం ఆరోగ్యకరమైన జీవనశైలికి అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## మొటిమలు, బ్లాక్‌హెడ్స్ పోవాలంటే..

జామ కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్న విషయం తెలిసిందే. అయితే జామకాయలే కాదు.. జామాకుల వల్ల కూడా ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి. వీటితో మొటిమలు, బ్లాక్‌హెడ్స్ సమస్యల నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. మొటిమల సమస్యతో బాధపడే వారికి జామాకు చక్కటి పరిష్కారం చూపుతుందంటున్నారు. జామాకులో యాంటీసెప్టిక్ గుణాలు అధికంగా ఉంటాయి. అవి మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాని నశింపజేస్తాయట. దీనికోసం జామాకులతో చేసిన పేస్ట్‌ని మొటిమల దగ్గర అప్లై చేసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

బ్లాక్‌హెడ్స్ పోవాలంటే.. అమ్మాయిలను ఎక్కువగా ఇబ్బంది పెట్టే మరో సమస్య బ్లాక్‌హెడ్స్. వీటిని జామాకు, కలబందతో నివారించచ్చని చెబుతున్నారు నిపుణులు. దీనికోసం ఒక టేబుల్ స్పూన్ జామాకు పేస్ట్‌ని తీసుకోవాలి. దానికి అంతే మొత్తంలో కలబంద గుజ్జు, చిటికెడు పసుపుని కలపాలి. ఇలా కలపగా వచ్చిన మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ పైన రాయాలి. అలా 20 నిమిషాల పాటు ఉంచిన తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు.



అయితే ఇది సహజసిద్ధమైన చిట్కానే అయినా ఒకసారి ప్యాచ్ టెస్ట్ చేసుకుని ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించుకున్న తర్వాతే దీనిని వాడడం మంచిది అంటున్నారు నిపుణులు. అలాగే వాడే ముందు జామాకులను దుమ్ము లేకుండా చక్కగా శుభ్రం చేయాలి అని సూచిస్తున్నారు.

